క్లుప్తంగా

కార్డెన్ సర్చ్‌లో 25 వాహనాలు స్వాధీనం



వన్‌టౌన్ పరిధిలో కార్డెన్ సర్చ్ నిర్వహిస్తున్న సీఐ చలపతి

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన కార్డెన్ సర్చ్‌లో సరైన పత్రాలు లేని 25 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చలపతి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత టపాకాయలు పేల్చటం, ఊరేగింపుల చేయటం నిషేధమని ప్రజలకు వివరించామన్నారు. రౌడీషీటర్లను బైండోవర్ చేశామని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించామని చెప్పారు. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వెంటనే సంభందిత పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

ఘనంగా అబ్దుల్లా స్వామి ఉరుసు



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

గోస్పాడు: మండలంలోని జూలేపల్లె గ్రామంలో వెలసిన అబ్దుల్లాస్వామి ఉరుసు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఉరుసు మహోత్సవంలో భాగంగా గ్రామానికి చెందిన ప్రజలు కులమతాలకు అతీతంగా స్వామి దర్గా వద్ద ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. శుక్రవారం వేకువజాము నుంచే స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. ప్రజలు స్వామి వారికి కాయ, కర్పూరంతో పాటు నైవేద్యం సమర్పించారు. మహోత్సవంలో గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా పోలీసు బందోబస్తును ఎస్‌ఐ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

రేపు పూర్వ విద్యార్థుల సమావేశం

వెలుగోడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమావేశం ఈ నెల 26వ తేదీ నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు జెఎండీ ఇంతియాజ్ తెలిపారు. 1996-1997వ విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థుల సమావేశం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పాఠశాలలో చదివిన విద్యార్థులంతా సమావేశానికి హాజరు కావాలని కోరారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం పూర్వ విద్యార్థులు ఇంతియాజ్, మల్లికార్జున, గోపాల్, ఫయాజ్ అహ్మద్, అబ్దుల్ వాహీద్, శ్రీకాంత్, సలీంఖాన్, తదితరులు పర్యవేక్షించారు.

అంకాలమ్మకు ప్రత్యేక పూజలు



శ్రీశైలం: మల్లికార్జునస్వామి క్షేత్రాన్ని పరిరక్షించే అంకాలమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు చేసి వివిధ రకాల పుష్పాలు, నిమ్మకాయలతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



చెట్టును ఢీకొన్న లారీ

మహానంది: నంద్యాల-గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులో చక్కెర లోడ్‌తో వెళ్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలైన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గిద్దలూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు...కర్ణాటక రాష్ట్రం నుంచి ప్రకాశం జిల్లా కంభం వస్తున్న లారీ నల్లమలలోని పురాతన ఇటుకల బ్రిడ్జివద్ద అద్దంకి నుంచి అనంతపురం వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి పక్కనే ఉన్న అడవిలోకి దూసుకెళ్లి చెట్టును గుద్దుకుంది. ఈ ఘటనలో బేతంచర్ల మండలం హెచ్.కొట్టాలకు చెందిన డ్రైవర్, ఓనర్ మద్దిలేటితో పాటు బైక్‌పై వెళ్తున్న అద్దంకికి చెందిన అనిల్‌కుమార్, ఉప్పుతల రామకృష్ణ గాయపడ్డారు. విషయం తెలుసుకున్న గిద్దలూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి గాయపడిన వారిని 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సాగుకు సమాయత్తం

- పలకరించిన వరుణుడు
- ఇప్పటికే పదునైన పొలాలు
- జోరందుకున్న వ్యవసాయ పనులు
- మండలంలో ఖరీఫ్ సాగు అంచనా 2,724 హెక్టార్లు



రూపనగుడి సమీప పొలంలో గత పంట అవశేషాలను తొలగిస్తున్న రైతులు,



ఉయ్యాలవాడలో ట్రాక్టర్ సహాయంతో మడక దున్నుతున్న రైతు

ఉయ్యాలవాడ : ఈ ఏడాది ఖరీఫ్‌నకు ముందుగానే ఈ నెల 17న మండలంలో భారీ వర్షం కురిసింది. నంద్యాల జిల్లాలోనే అత్యధికంగా ఉయ్యాలవాడలో 117.4 ఎం.ఎ. వర్షపాతం నమోదైంది. వర్షాధార మెట్ట పైర్లు సాగు చేసేందుకు ముందస్తుగా దుక్కులు దున్నేందుకు అవకాశం లభించింది. దీంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. గతంలో సాగు చేసిన మొక్కజొన్న, మిరప, పత్తి తదితర పంటల అవశేషాల తొలగింపు, సేంద్రియ ఎరువులు తరలించడం, వెదజల్లడం వంటి పనుల్లో అన్నదాతలు బిజీగా ఉన్నారు. మండలంలోని 11 రైతు భరోసా కేంద్రాల పరిధిలో గత ఖరీఫ్‌లో 2,724 హెక్టార్లలో ప్రధానంగా వరి, మొక్కజొన్న, మిరప, పత్తి, కంది, మినుము, సోయాబీన్, పొగాకు, జొన్న పంటలు సాగు చేశారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో కూడా అదే స్థాయిలో పంటలు సాగు చేసేలా వ్యవసాయాధికారులు రైతులను ప్రోత్సహిస్తున్నారు. పంటలు సాగు చేసే సమయంలో రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండానే ప్రభుత్వం సాగుకు ముందే ఆర్బీకేల్లో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు స్థానిక వ్యవసాయాధికారులు రైతుల డిమాండ్‌ను బట్టి ఉన్నతాధికారులకు నివేదికలు సిద్ధం చేసి పంపారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు పది రోజుల ముందే భూమి పదునయ్యే వర్షం కురిసింది. రైతులకు అవసరమైన విత్తనాలు, రసాయనిక ఎరువులు సిద్ధం చేస్తున్నాం. రైతులు కూడా తమ తమ గ్రామాల్లోనున్న ఆర్బీకేలలో కావాల్సిన ఎరువులు, విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. పంటల సాగులో అన్నదాతలు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి. – రాజేంద్రకుమార్, ఏఓ, ఉయ్యాలవాడ

27 నుంచి ఉచిత యోగా శిక్షణ తరగతులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని శ్రీనివాస్ నగర్ మున్సిపల్ పార్క్‌లోని ఆయుష్ యోగా కేంద్రంలో మే 27వ తేదీ నుంచి ఉచిత యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శ్రీ ఖండే ఆనంద్ గురూజీ శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ రెండు బ్యాచ్‌లుగా శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఉదయం 5.20 నుంచి 6.30 వరకు మొదటి బ్యాచ్, 6.30 నుంచి 7.45 వరకు రెండవ బ్యాచ్‌కు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ కాలంలో ఆసనములు, ప్రాణాయామం, ఎక్సర్‌సైజులు, క్రియలు, ధ్యానం నేర్పుతామన్నారు. అలాగే నడుము నొప్పి, ఊబకాయం, బీపీ షుగర్, థైరాయిడ్, పీసీఓడీ, గ్యాస్ట్రబుల్, అల్సర్, ఎసిడిటీ, మలబద్ధకం ఇలా అనేక రకాల సమస్యలతో బాధపడుతున్న వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని వైద్య పరీక్షలు చేపించి, తగిన ఆసనాలు నేర్పుతామని చెప్పారు. యోగా అనంతరం ప్రతిరోజూ ఉదయం కూరగాయల రసం, 20 రకాలతో కూడిన పండ్లు, కూరగాయలు, మొలకెత్తిన గింజలు, డ్రై ఫ్రూట్స్‌తో అమృత ఆహారం, సాయంత్రం 7.30కి 10 రకాల సీజనల్ ఫ్రూట్స్ అందజేస్తాని తెలిపారు. వివరాలకు, పేర్ల నమోదుకు 9989983673 సంప్రదించాలన్నారు.

శ్రీకాళికాంబాదేవికి ప్రత్యేక పూజలు



శ్రీ కాళికాంబాదేవికి మంగళ హారతి ఇస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబా చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం అనంతరం వివిధ రకాల పూజలు చేశారు. అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమాన్ని నిర్వహించి పుష్పాభిషేకాన్ని నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. అనంతరం రాహుకాల పూజలు జరిపించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేశారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం కాళీమాత సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, దేవస్థానం చైర్మన్ ఆరవేటి వాసు, విజయ్‌కుమార్, లక్ష్మిదేవి, అర్చకులు సుబ్బాచారి, రాఘవేంద్రాచారి, సుబ్రహ్మణ్యం శాస్త్రి, తిమ్మయ్య, నరసింహులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సొసైటీల కంప్యూటరైజేషన్



సంఘాల వివరాలు కంప్యూటర్‌లో పొందుపరుస్తున్న సిబ్బంది

శిరివెళ్ల: మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో వివరాలకు సంబంధించి కంప్యూటరైజేషన్ ప్రక్రియ ముమ్మరంగా జరుగుతుంది. స్థానిక కేడీసీసీ బ్రాంచి పరిధిలో 6 సహకార సంఘాలు ఉన్నాయి. శిరివెళ్లలో శిరివెళ్ల, బోయలకుంట్ల, రుద్రవరం మండలంలో రుద్రవరం, పెద్ద కంబలూరు, గోస్పాడు మండలంలో యాళ్లూరు, గోస్పాడు గ్రామాలలో సహకార సంఘాలు ఉన్నాయి. ప్రతి సంఘంలో 1500 నుండి 2 వేలు దాకా రైతులు సభ్యత్వం కలిగి ఉన్నారు. వారికి సంభందించిన రుణాలు, వసూళ్లు తదితర వివరాలు రికార్డులలో ఉన్నాయి. ఈ మేరకు కంప్యూటర్‌లో వివరాలు పొందుపరచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేశాయి. దీంతో ముందుగా సభ్యత్వదారుల సమాచారం, లావా దేవీలన్నింటినీ క్రోడీకరించి డేటాను తయారు చేశారు. డేటాను ప్రస్తుతం ప్రత్యేక వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ప్రక్రియ జరుగుతుంది. కంప్యూటరైజేషన్ పరిశీలించిన మేనేజర్ రేణుక మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా బ్యాంక్‌లన్నీ కంప్యూటరైజేషన్ అయ్యాయి. ముందుగా కేడీసీసీ బ్రాంచీలు కంప్యూటరీకీకరణ పూర్తియిందన్నారు. ఇప్పుడు సహకార సంఘాలలో ప్రారంభించామని చెప్పారు. ఇకపై ఆర్థిక లావాదేవీలు సులభతరం అవుతాయని వివరించారు.

ఖరీఫ్ పంటలకు ఎరువులు సిద్ధం



మాట్లాడుతున్న ఏఓ ప్రసాదరావు

నంద్యాల(అర్బన్): మండలంలో రైతులకు ఖరీఫ్‌కు అవసరమైన ఎరువులు సిద్ధంగా ఉన్నాయని ఏఓ ప్రసాదరావు తెలిపారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఖరీఫ్-2024కి సంసిద్ధత, కార్యాచరణపై ఏఈఓలు, వీఏఏలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలానికి 320 క్వింటాళ్ల పచ్చిరొట్ట ఎరువులు మంజూరు అయ్యాయన్నారు. 12 యూనిట్ల బీపీటీ 5204 వరి రకం ఫౌండేషన్ విత్తనాలు గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకం కింద మంజూరైనట్లు తెలిపారు. ఖరీఫ్ కాలానికి 7468 హెక్టార్లు మండల గ్రామాల్లో సాధారణ విస్తీర్ణం కాగా అందులో వరి, మొక్కజొన్న, కంది, మినుము, పత్తి పంటలు రైతులు సాగు చేయనున్నారని చెప్పారు. వీటికి అవసరమైన ఎరువులు, విత్తనాలు ఆర్‌బీకేల ద్వారా అందజేయనున్నామని, అవసరమైన రైతులు సంబంధిత ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

పల్లకీలో మహానందీశ్వరుడి విహారం



మహానందిలో పల్లకిసేవ దృశ్యం

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ గంగ, శ్రీ కామేశ్వరీదేవి సమేత మహానందీశ్వరస్వామి వార్లకు శుక్రవారం రాత్రి పల్లకీ సేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, బలిహరణ పూజల అనంతరం స్వామి, అమ్మవార్లు ఆలయ ప్రాకారాల్లో విహరించారు.

తగ్గనిరద్దీ

మహానందిలో భక్తులరద్దీ తగ్గడం లేదు. వేసవిసెలవులు ఉండటంతో వేలాది సంఖ్యలో భక్తజనం తరలివస్తున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు.

అన్నప్రసాద కేంద్రానికి 120 బస్తాల బియ్యం విరాళం

మహానంది దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నప్రసాద వితరణ కేంద్రానికి నంద్యాల మండలం కొత్తపల్లె గ్రామానికి చెందిన రైతులు సహకరించినట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆలయ ఏఈఓలు వై.మధు, ఓంకారం వేంకటేశ్వరుడు, సిబ్బంది శుక్రవారం గ్రామానికి చేరుకుని రైతులతో మాట్లాడి బియ్యం బస్తాలను సేకరించారు. పలువురు రైతులు ప్రస్తుతం 35 బస్తాల బియ్యం విరాళంగా ఇచ్చారని, మరికొందరు కలిసి మొత్తం 120 బస్తాల బియ్యం ఇస్తామని ముందుకు వచ్చినట్లు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు



మాట్లాడుతున్న వైకేపీ అదనపు ప్రాజెక్టు ఆఫీసర్ సలాం

జూపాడుబంగ్లా: ప్రకృతి వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో నాణ్యమైన ఆహార పదార్థాలను పండించవచ్చని వైఎస్సార్ క్రాంతి పథం జిల్లా అదనపు ప్రాజెక్టు మేనేజర్ సలాం తెలిపారు. శుక్రవారం జూపాడుబంగ్లా వైకేపీ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మనం తింటున్న ఆహారధాన్యాలలో రసాయన మందుల అవశేషాలు అధికంగా ఉండటం వల్ల తినే ఆహారం విషతుల్యంగా ఉంటుందన్నారు. పంటల సాగులో రైతులు రసాయన మందుల వాడకం అధికం కావటంతో భూమి సాంద్రత కూడా దెబ్బతినటంతో దిగుబడులు తగ్గిపోతున్నాయని చెప్పారు. అంతేకాకుండా పండించే ఆహారధాన్యాలు విషతుల్యం కావటంతో ప్రజలు రోగాలబారిన పడున్నారని తెలిపారు. రైతులు పెట్టుబడులు తగ్గించుకొని స్వచ్ఛమైన దిగుబడులను సాధించాలంటే తప్పనిసరిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలని సూచించారు. గ్రామాల్లోని రైతులతో పాటు పొదుపు మహిళలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించి వారిని ఆదిశగా ప్రోత్సహించాలని ఏపీఎం అంబమ్మ, వైకేపీ కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, వీఓఏ లకు సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఫెసిలిటేటర్ అయ్యన్న, సీసీలు నాగన్న, గాంధీ, విజయలక్ష్మి, నాయక్, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ నియంత్రణ కమిషన్ ఏర్పాటు హర్షణీయం

నంద్యాల(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ నియంత్రణ కమిషన్ (ఏపీఈఆర్‌సీ)ను కర్నూలులో ఏర్పాటు చేయడం ఆహ్వానించదగ్గ విషయమని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథరామిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ పరిణామాన్ని జీర్ణించుకోలేక కొన్ని రాజకీయ పార్టీల నాయకులు ఇంత హడావిడిగా సదరు కార్యాలయాన్ని కర్నూలులో ఏర్పాటు చేయడమేమిటని ప్రశ్నించడం దారుణం అన్నారు. పైగా ఈ కార్యాలయాన్ని విజయవాడకు తరలించాలని దుర్బుద్ధితో మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పాలన వికేంద్రీకరణలో భాగంగా పలు కార్యాలయాలను కర్నూలులో ఏర్పాటు చేయడం సంతోషకరమని, వీటితోపాటు హైకోర్టును, కృష్ణానదీ యాజమాన్య బోర్డు కార్యాలయం సైతం అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. శ్రీబాగ్ ఒడంబడికను అమలు చేయకపోవడంపై ఇన్నాళ్లు ప్రశ్నించలేని నాయకులు, ఇప్పుడు రాష్ట్ర స్థాయి కార్యాలయాలు కర్నూలులో ఏర్పాటు చేస్తుంటే ఓర్వలేకపోతున్నారన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ రాయలసీమ అభివృద్ధికోసం జాగృతం కావాలని పిలుపునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రుద్రవరం: రుద్రవరం-రెడ్డిపల్లె గ్రామాల మధ్య శుక్రవారం రాత్రి రెండు మోటార్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీ కొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. రుద్రవరం నుంచి రమేష్, రెడ్డిపల్లె నుంచి అఖిల్ మోటార్ సైకిళ్లపై వెళ్తూ అదుపుతప్పి ఢీ కొని గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదంపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

ఘనంగా రోఖియాబీ ఉరుసు

వెలుగోడు: పట్టణంలో రోఖియాబీ ఉరుసు ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం రాత్రి దర్గా నిర్వాహకుల ఇంటి వద్ద నుంచి ప్రధాన రహదారి వెంట డప్పు వాయిద్యాలు, బాణా సంచాల మధ్య, అశేష భక్తజనుల సమూహంలో గంధాన్ని ఊరేగింపుగా రోఖియాబీ దర్గా వరకు తీసుకువచ్చారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ఫాతేహాలు సమర్పించి పూజలు చేశారు. భక్తులు, బంధుమిత్రుల రాకతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎస్‌ఐ భూపాలుడు సీసీ కెమెరాల పర్యవేక్షణలో గట్టి బందోబస్తు నిర్వహించారు. గాజులు, ఆటవస్తువుల దుకాణాలు, మిఠాయి అంగళ్లతో పట్టణం కళకళలాడుతోంది. ఉరుసు సందర్భంగా దర్గాను ప్రత్యేక విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ముగిసిన టీటీడీ ధార్మిక కార్యక్రమాలు

వెలుగోడు: స్థానిక అయపురెడ్డి నగర్‌లో వెలసిన శ్రీలక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. మూడు రోజులపాటు శ్రీమద్రామాయణం, మహాభారతం భగవద్గీతలపై మద్దయ్య స్వామి చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తులను అలరించాయి. ముగింపు సందర్భంగా శుక్రవారం గోపూజ , కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం వ్యవస్థాపక అధ్యక్షుడు బల్లాని వెంకటసత్యనారాయణ, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, భజన మండలి అధ్యక్షుడు తెలుగు నాగలక్ష్మమ్మ, జ్యోత్స్న, సాలమ్మ, అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు టీకాలు వేయించండి



ఎద్దుకు టీకాలు వేస్తున్న పశువైద్యశాఖ అధికారులు

జూపాడుబంగ్లా: ఆవులు, గేదెలు తదితర జీవాల్లో గొంతువాపు, జబ్బవాపు, చిటికె వ్యాధుల నివారణకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని పశుసంవర్ధకశాఖ అసిస్టెంటు డైరెక్టర్ రామాంజనేయనాయక్ సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెల్లజాతి పశువులైన ఆవులు, ఎద్దులు, ఆవుదూడలకు జబ్బవాపు వ్యాధి సంక్రమించే అవకాశాలున్నందున వ్యాధినివారణకు ముందస్తు చర్యగా బ్లాక్‌క్వార్టర్ అనే టీకాను ఉచితంగా వేస్తున్నట్లు తెలిపారు. అలాగే నల్లజాతి పశువులైన గేదెలకు గొంతువాపు వ్యాధి నివారణ నిమిత్తం హేమరేజిక్ సెప్టిసేమియా అనే టీకాను వేస్తున్నామని చెప్పారు. మేకలు, గొర్రెలు,పొట్టేళ్లకు వ్యాపించే చిటికె వ్యాధి నివారణకు ఎంటరోటాక్సిమియా అనే టీకాలను వేస్తున్నట్లు తెలిపారు. మండలం వ్యాప్తంగా 1,680 తెల్లజాతి పశువులుండగా ఇప్పటిదాకా 650లకు, నల్లజాతి పశువులు 3,583 ఉండగా ఇప్పటిదాకా 500 పశువులకు టీకాలు వేసినట్లు వెల్లడించారు. 22,633 జీవాలుండగా వాటికి రెండు రోజుల్లో టీకాలు వేయనున్నట్లు తెలిపారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



చాగలమర్రి పోలీసు స్టేషన్‌లోని ట్రాక్టర్‌ను పరిశీలిస్తున్న ఎంవీఐ రవిశంకర్‌నాయక్

చాగలమర్రి: వాహన చోదకులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని నంద్యాల ఎంవీఐ రవిశంకర్‌నాయక్ సూచించారు. ఇటీవల ముత్యాలపాడులో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతికి కారణమైన ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. ఈ మేరకు చాగలమర్రి పోలీసు స్టేషన్‌లో ఉన్న ట్రాక్టర్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ చాగలమర్రి 40వ నంబరు జాతీయ రహదారిపై కూలూరు వద్ద వేగానికి సంబంధించిన మొదటి, రెండవ వరసల సూచికలు ఏర్పాటు చేస్తే ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. రహదారిని నిబంధనలు పాటించనందునే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ప్రతిఒక్కరూ డ్రైవింగ్ చేసేప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

స్కూల్ బస్సుల యాజమాన్యాలు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవాలి

స్కూల్ బస్సుల యాజమాన్యాలు తమ వాహనాలకు సంబంధించి కచ్చితంగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవాలని ఎంవీఐ రవిశంకర్‌నాయక్ సూచించారు. జూన్ 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయని, బస్సులను మాజమాన్యాలు ఆర్టీఓ నిబంధనల మేరకు ఫస్ట్ ఎయిడ్ బాక్సు, అటెండెంట్ ఏర్పాటు చేసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలని ఆదేశించారు. అలాగే బస్సు డ్రైవర్ హెవీ లైసెన్స్‌ను అందరికీ కనబడేలా ఉంచుకోవాలని, బస్సుకు సంబంధించిన అన్నీ రికార్డులు కలిగి ఉండాలన్నారు. రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రమణయ్య, సిబ్బంది పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో నీటి సమస్యకు పరిష్కారం



శ్మశాన వాటికలో నిర్మించిన మినీ వాటర్ ట్యాంక్

రుద్రవరం: మండలంలోని ఆలమూరు గ్రామ సమీపంలోని శ్మశాన వాటిక వద్ద నెలకొన్న నీటి సమస్యను సర్పంచ్ పాణ్యం లక్ష్మీదేవి పరిష్కరించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అంత్యక్రియల సమయంలో శ్మశాన వాటికలో నీటి వసతి లేక ప్రజలు ఇబ్బందులు పడేవారు. వ్యవసాయ పొలాల్లోని బోరునీటి వద్దకు వెళ్లి వినియోగించుకునే దుస్థితి. నీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు నెలక్రితం సర్పంచ్ పాణ్యం లక్ష్మీదేవికి విన్నవించారు. ఈ మేరకు ఆమె వెంటనే శ్మశాన వాటిక వద్ద మినీ వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేయించారు. ఈ ట్యాంక్‌లోకి పైపులైన్ ద్వారా నీరు సరఫరాను చేస్తున్నారు. సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు నాగేష్, చంద్ర, ప్రభాకర్, జయరాం, సుబ్బరావు, బాలయ్య తదితరులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

డిప్యూటీ ఈఓ పరీక్ష పకడ్బందీగా నిర్వహించండి



మాట్లాడుతున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

నంద్యాల: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహిస్తున్న డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ పోస్టుల నియామక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పరీక్ష నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ అండ్ పీజీ కళాశాల, మున్సిపల్ టౌన్ హాల్ ఎదురుగా (ఆపోజిట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్), రామకృష్ణ డిగ్రీ అండ్ పీజీ కళాశాల (అటానమస్) ఎస్‌బీఐ కాలనీ చివర, గుడ్‌షెప్పర్డ్ స్కూల్ రోడ్డు, ఇంజినీరింగ్ కాలేజ్ అయ్యలూరు మెట్ట మొత్తం మూడు పరీక్ష కేంద్రాల్లో 605 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. అభ్యర్థులు ఉదయం 7.30 నుంచి 8.15 లోపు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. 15 నిమిషాలు గ్రేస్ పీరియడ్‌గా 8.30 వరకు పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారన్నారు. ఆపై వచ్చిన వారిని ఎట్టి పరిస్థితుల్లో పరీక్ష కేంద్రంలోకి అనుమతించమని చెప్పారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్స్, ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబడవన్నారు. పరీక్షలు నిర్వహించే యంత్రాంగం కూడా సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్ష కేంద్రాల్లోకి తీసుకుపోకూడదని ఆదేశించారు. అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలను చేరుకోవడానికి ఆర్టీసీ బస్సుల సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ పద్మజ, ఎగ్జామ్స్ అబ్జర్వర్ షరీఫ్, అసిస్టెంట్ సెక్రటరీ డిల్లేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కొత్తపల్లి: పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ జవహర్‌బాబు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని ఎర్రమఠం, ముసలిమడుగు, గుమ్మడాపురం, శివపురం, కొత్తపల్లి సచివాలయాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కొందరు సిబ్బంది రిజిస్టర్లో సంతకాలు చేసి విధుల్లో లేకపోవడం , సచివాలయంలో లేకపోవడం, క్యాంపుల పేరుతో బయటికి వెళ్లడం వంటివి చేస్తున్నారని గమనించారు. విధుపట్ల నిర్లక్ష్యంగా ఉన్న ఎనిమిది మంది సిబ్బందికి నోటీసులు జారీ చేశారు. మూడురోజుల లోపు వారు సంజాయిషీ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు.

ఏజెన్సీ ఉద్యోగుల అంతర్గత బదిలీలు

మహానంది: మహానందీశ్వరుడి దేవస్థానంలోని ఏజెన్సీ విభాగంలో పనిచేస్తున్న 30 మంది ఏజెన్సీ సిబ్బందికి విధులు మారుస్తూ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈఓ మాట్లాడుతూ పరిపాలనా సౌలభ్యం కోసం విధుల్లో మార్పులు చేశామన్నారు. సమాచార కేంద్రం, వసతిగృహాల విభాగం, వివిధ ఆర్జిత సేవా కౌంటర్లలో పనిచేస్తున్న సిబ్బందికి స్థాన చలనం కలిగించామని చెప్పారు. ఎవరికి కేటాయించిన విధుల్లో వారు చేరాలని ఆదేశించారు.